సాక్షి విజయనగరం

మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



శరవేగంగా అభివృద్ధి పనులు

జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పాలన సాగిస్తోంది. పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తోంది. - 8లో



ముగిసిన హ్యాకథాన్ పోటీలు

నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో నిర్వహించిన హ్యాకథాన్ పోటీలు ముగిశాయి. - 8లో



విద్యార్థుల పాత్ర కీలకం

దేశ భవిష్యత్ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమని విశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ వినోద్‌కుమర్ పర్మార్ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

క్షయ నివారణ విభాగంలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: పార్వతీపురం మన్యం జిల్లాలో క్షయ నివారణ విభాగంలో వివిధ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎయిడ్స్, కుష్ఠు, క్షయ నివారణ అధికారి డాక్టర్ సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ఆఫీసర్ పోస్టు-1, డిస్ట్రిక్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పోస్టు-1, పీపీఎం కో ఆర్డినేటర్-1, టీబీ, హెచ్ఐవీ విభాగం సూపర్ వైజర్-1, అకౌంటెంట్-1 పోస్టులకు అక్టోబర్ 3వ తేదీలోగా విజయనగరంలోని జిల్లా క్షయ నియంత్రణ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు



దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న విశాఖరేంజ్ డీఐజీ హరికృష్ణ

విజయనగరం క్రైమ్: విశాఖపట్నం కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ మైదానంలో ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 25 వరకూ స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్ఐ అభ్యర్థులకు నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలు విజయవంతంగా ముగిసినట్టు విశాఖరేంజ్ డీఐజీ హరికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ మెజర్‌మెంట్, ఎఫిషియన్సీ పరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అక్టోబర్ 14, 15 తేదీల్లో జరిగే చివరి ప్రధాన రాత పరీక్షలకు అర్హులని తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన పోలీస్ అధికారులు, మినిస్టీరియల్ సిబ్బందిని ఆయన అభినందించారు.

అథ్లెటిక్స్‌లో రాణించిన గురుకుల విద్యార్థి



ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించిన శశాంక్

బొబ్బిలి: గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బొబ్బిలి కోమటిపల్లి జ్యోతిబాఫూలే గురుకుల పాఠశాల విద్యార్థి కందికుప్పి శశాంక్ రాణించాడు. 1.51 మీటర్లు హైజంప్ చేసి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. గురుకులంలో 9వ తరగతి చదువుతున్న శశాంక్‌ది పార్వతీపురం మన్యం జిల్లాలోని పాచిపెంట. వ్యవసాయ కుటుంబానికి చెందినవాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్ గుణుపూరు పురుషోత్తంతో పాటు గురుకుల సిబ్బంది అభినందించారు.

పీటీసీ ప్రిన్సిపాల్‌కు సత్కారం



పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబును సత్కరిస్తున్న శిక్షణార్థులు

విజయనగరం క్రైమ్: పోలీస్ శిక్షణ కళాశాల గ్రౌండ్‌లో సాధన చేసుకునేందుకు అవకాశం కల్పించి, సాధనలో మెలకువలను నేర్పిన పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబును పలువురు యువకులు సోమవారం సత్కరించారు. ఇక్కడ సాధన చేసిన 120 మందిలో అగ్నివీర్‌కు 19 మంది, ఎస్ఎస్‌సీ జీడికి 12 మంది ఎంపికయ్యారు. మరో 51 మంది ఏపీ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ శారీరక దారుఢ్య పరీక్షలో విజేతలుగా నిలిచి రాత పరీక్షకు అర్హత సాధించారు. శిక్షణకు ప్రోత్సహించిన పీటీసీ ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ పి.వి.అప్పారావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్ పి.కోటేశ్వరరావు, డి.శంకర్, కె.మురళి మోహన్‌లను యువకులు సత్కరించారు.

ఏకదంతుని కల్యాణ వైభవం



వినాయకునికి కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న వేదపండితుడు

బొబ్బిలి పట్టణంలోని కోరాడ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సోమవారం సాయంత్రం విఘ్నేశ్వర కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఏకదంతునికి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. - బొబ్బిలి

శ్రీనివాసునికి పూలంగి సేవ

విజయనగరం అరుంధతీనగర్‌లో కొలువైన శ్రీనివాసునికి భక్తులు సోమవారం పూలంగి సేవ జరిపారు. ఆలయ అర్చకుడు రాజేష్ ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జాము నుంచి విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించి స్వామివారి సేవలో తరించారు.

- విజయనగరం టౌన్



అలరించిన నృత్య ప్రదర్శన

విజయనగరం మండలంలోని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సౌమ్య నృత్య దర్శకత్వంలో సోమవారం పలువురు చిన్నారులు 'వేయీ నామాలవాడ, సిద్ధి వినాయక హిమగిరి తనయ' భక్తిగీతాలకు సోమవారం నృత్యప్రదర్శనలతో అలరించారు. శ్రీలక్ష్మీ గణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. - విజయనగరం రూరల్



చిన్నారుల నృత్యప్రదర్శన

పారదర్శక పాలన

- అధికారం హోదా కాదు, బాధ్యతగా భావిస్తున్నాం
- ఉమ్మడి విజయనగరం జిల్లాను అగ్రగామిలో నిలుపుతాం
- రూ.52 కోట్లతో అభివృద్ధి పనులు
- జిల్లా చరిత్రలోనే 'ఇంటింటికీ తాగునీరు' కార్యక్రమానికి రూ.1000 కోట్లు
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



జిల్లా పరిషత్ కార్యాలయంలో సిబ్బంది సమక్షంలో కేక్‌కట్ చేస్తున్న చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో జిల్లాలో పారదర్శక పాలన అందిస్తూ, అభివృద్ధిలో ఉమ్మడి విజయనగరం జిల్లాను అగ్రగామిగా నిలుపుతామని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా రెండేళ్లు పదవీకాలం పూర్తయిన సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం హోదా కాదని, బాధ్యతగా భావించి ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. సేవ చేసే భాగ్యం, గొప్ప అవకాశాన్ని కల్పించిన ప్రజలకు, ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. రెండేళ్లలో విజయనగరం, పార్వతీపురం జిల్లాల అభివృద్ధికి జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎం రాజన్న దొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు అందించిన సహాయ సహకారాలు మరువలేనివన్నారు. వారికి జెడ్పీ కార్యవర్గం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు, సామాన్య ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారితో మమేకం అవుతున్నామన్నారు. జెడ్పీలో ప్రతిపక్షం లేనప్పటికీ ప్రజా సమస్యలే తమ సమస్యలుగా తమ పార్టీ సభ్యులు నిరంతరం ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న విషయం తనకు అత్యంత సంతృప్తిని ఇచ్చిందన్నారు. ప్రజలతో మమేకమవుతూ వారిలో నమ్మకాన్ని కలిగించామన్నారు.

తాగునీటికి రూ.1000 కోట్లు

ఇంటింటికీ తాగునీరు అందించాలనే ధ్యేయంతో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

పని చేస్తున్నామని, జిల్లా చరిత్రలోనే ఇంటింటికీ కుళాయి పథకానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రూ.1000 కోట్లు మంజూరు చేశాయని జెడ్పీ చైర్మన్ తెలిపారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనులకు ఇప్పటికే రూ.80 కోట్లకు పైగా బిల్లులు చెల్లించామన్నారు. జిల్లా పరిషత్ నిధులు నుంచి సుమారు రూ.52 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో తాగునీరు, రహదారుల నిర్మాణానికి అధిక నిధులు వెచ్చించినట్టు స్పష్టంచేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని, క్రీడాభివృద్ధికి, భవన నిర్మాణాలు పూర్తిచేశామన్నారు. ప్రజలకు వ్యక్తిగత సహాయం (వైద్య ఖర్చులకు) జెడ్పీ నిధులను నాలుగు శాతం కేటాయించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధ్యాన్యత, ఆదేశాలకు అనుగుణంగా నిధులను వెచ్చించామని చెప్పారు. అక్టోబర్ నాటికి ఉమ్మడి జిల్లా పరిధిలో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

46 మందికి కారుణ్య నియామకాలు

జిల్లా పరిషత్‌లో రెండేళ్లలో 46 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించామని జెడ్పీ చైర్మన్ తెలిపారు. ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, జెడ్పీ అధికారులు, సిబ్బంది సహకారం మరువలేనిదని, వారి సేవలను గుర్తించి 57 మందికి పదోన్నతులు కల్పించామన్నారు.

పార్టీ నిర్ణయమే శిరోధార్యం

ప్రజలకు నిష్పక్షపాతంగా పారదర్శక పాలన అందిస్తున్నామని, పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాటలోనే ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నామని చెప్పారు. పార్టీ నిర్ణయాలే మాకు శిరోధార్యమన్నారు. గత చైర్మన్లను ఆదర్శంగా తీసుకుని జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు రాబట్టేందుకు కృషి చేస్తామన్నారు. ఇదే ఉత్సాహంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు అభినందనలు

రెండేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సిబ్బంది సోమవారం అభినందించారు. పలువురు జెడ్పీటీసీలు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్‌కౌశిక్
- స్కూల్ గేమ్స్ అండర్-14,17 కరాటే జట్ల ఎంపిక పోటీలు



అండర్-14,17 స్కూల్ గేమ్స్ కరాటే క్రీడాకారుల ఎంపిక పోటీలు ప్రారంభిస్తున్న ఈశ్వర్ కౌశిక్, రామ్‌గోపాల్

విజయనగరం: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని, చిన్ననాటి నుంచే ఇష్టమైన క్రీడారంగంలో రాణించాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్‌కౌశిక్ అన్నారు. విజయనగరం రాజీవ్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 వయస్సుల విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించిన జిల్లాస్థాయి కరాటే క్రీడాకారుల ఎంపిక పోటీలను సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న వారికి చదువుతో పాటు, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. జిల్లా తరపున ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించి మన ప్రాంతానికి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీలకు రెండు విభాగాల్లో 200 మందికిపైగా క్రీడాకారులు హాజరు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణిలు

కాగా అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో రాష్ట్ర స్థాయిలో జరగబోయే స్కూల్‌గేమ్స్ కరాటే పోటీలకు జిల్లా నుంచి పంపిస్తామని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్.వి.రమణ తెలిపారు. ఎంపిక పోటీలను పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, కరాటే కోచ్‌లు పర్యవేక్షించారు.

రేపు హాకీ, తైక్వాండో జట్ల ఎంపిక పోటీలు

రాష్ట్ర స్థాయిలో జరగబోయే అండర్-14 బాల, బాలికల హాకీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 27న రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్.వి.రమణ తెలిపారు. అదే రోజున అండర్-14,17 వయస్సుల విభాగాల్లో తైక్వాండో క్రీడాకారుల ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు విధిగా జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, సంబంధిత పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్‌ను వెంట తీసుకురావాలని సూచించారు.

మోదీజీ.. విద్యుత్ చార్జీల భారం తగ్గించండి



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వామపక్షాల నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: మోదీజీ.. రాష్ట్ర ప్రజలపై ట్రూ అఫ్ చార్జీల పేరుతో రూ.6వేల కోట్ల విద్యుత్ చార్జీలు భారాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యుత్ సంస్కరణల బిల్లు రద్దు చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. విజయనగరంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ పెరిగిన ధరలు తగ్గించాలని, విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలని, ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీల పెంపును నిలిపివేయాలని, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని నిరసిస్తూ ఈ నెల 27న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామన్నారు. కేంద్రప్రభుత్వ తీరుకు నిరసనగా చేపట్టే కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సీపీఎం జిల్లాకార్యవర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు, సీపీఐ(ఎంఎల్) నాయకుడు బెహరాశంకరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాయి రమణమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.రమణ పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన పెట్రోల్ ట్యాంకు



మృత దేహాలను పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్లో) పోలినాయుడు (ఫైల్)

- రెప్పపాటులో గాలిలో కలిసిన ఇద్దరి ప్రాణాలు
- పెట్రోల్ ట్యాంకు శుభ్రపరుస్తూ ఒకరు, సహాయం చేసేందుకు వెళ్లి మరొకరు మృత్యువాత

బొబ్బిలి: రెప్పపాటులో ఇద్దరి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. కూలి పనికి వెళ్లిన ఒకరు.. సహాయం చేసేందుకు వెళ్లిన మరొకరిని మృత్యువు కాటేసింది. వారి కుటుంబాలకు తీరని శోకం మిగిల్చింది. మూతపడిన పెట్రోల్ బంకును మళ్లీ తెరిపించే ప్రయత్నంలో అండర్ గ్రౌండ్ ట్యాంకును పరిశుభ్రం చేస్తున్న వ్యక్తి ఒకరు ఊపిరాడక మృతి చెందగా, సహాయం కోసం వెళ్లిన వ్యక్తి కూడా ఊపిరాడక టాంకులోనే మృతి చెందిన దుర్ఘటన బొబ్బిలిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఉన్న ఎస్సార్ పెట్రోల్ బంకును సత్యనారాయణ రెడ్డి అనే వ్యక్తి నడుపుతున్నారు. ఈ బంకు కొద్ది రోజులుగా మూతపడి ఉంది. మళ్లీ తెరిపిద్దామన్న ఉద్దేశంతో బంకులోని ట్యాంకులను శుభ్రం చేసేందుకు సోమవారం చింతాడకు చెందిన పెద్దింటి పోలినాయుడు, యామలపల్లి తవిటినాయుడు, అల్లు నారాయణరావును కూలికి పిలిచారు. ఈ క్రమంలో అండర్ గ్రౌండ్‌లో ఉన్న బంకు టాంకు ఓపెన్ చేశారు. శుభ్రం చేయాలంటే కిందకు దిగాలనడంతో... కూలీల్లో ఒకరైన పెద్దింటి పోలినాయుడు (55) నూతుల్లో దిగే అనుభవం ఉండడంతో వెంటనే దిగాడు. క్షణాల్లోనే ఊపిరాడక ట్యాంకులోనే ఉండిపోయాడు. పైన ఉన్న కూలీలు కేకలు వేయడంతో పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న మరో రోడ్డులో మరమ్మతుల కోసం నిలిచిఉన్న లారీ క్లీనర్.. పాట్నాకు చెందిన అన్షు (35) సహాయం చేసేందుకు పరుగున వెళ్లాడు. ట్యాంకులో దిగాడు. అంతే.. క్షణాల్లో ఆయన ప్రాణం కూడా గాలిలో కలిసిపోయింది. ఇద్దరి మృతితో ఆ ప్రాంతమంతా కన్నీటిసంద్రంగా మారింది. ఎస్సై చదలవాడ సత్యనారాయణ తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పెట్రోల్ బంకు యజమానిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడు పెద్దింటి పోలినాయుడుకు హైదబాద్‌లో ఉద్యోగం చేస్తున్న కుమారుడు సురేష్, పెళ్లయిన కుమార్తె పోలీసు ఉన్నారు. మేనల్లుడు హోంగార్డు ఘటనా స్థలంలోనే ఉండి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అన్షు మృతి వార్తను బరంపురానికి చెందిన లారీ ఓనర్‌కు పోలీసులు తెలియజేశారు.

అక్టోబర్ 1 నుంచి గోధుమ పిండి పంపిణీ

బొబ్బిలి: జిల్లాలోని తెలుపురంగు రేషన్‌కార్డు దారులందరికీ వచ్చేనెల 1 నుంచి కిలో చొప్పున గోధుమ పిండి పంపిణీ చేస్తామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కె.మీనాకుమారి సోమవారం తెలిపారు. ఇప్పటికే అర్బన్ ప్రాంతాల్లో గోధుమ పిండిని ఇస్తున్నామని చెప్పారు. జిల్లాలోని 5,81,214 కార్డుదారులకు 1249 రేషన్ డిపోల నుంచి సరుకులు సరఫరా చేస్తామని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు అధిక ప్రాధాన్యం

- చదువు మధ్యలో ఆపేసిన వారిని తిరిగి చేర్పించండి
- ఇళ్లు, ప్రభుత్వ భవవ నిర్మాణాలను వేగవంతం చేయాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ నాగలక్ష్మి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని క్షేత్రస్థాయిలో వైద్యసేవలందించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు అధిక ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. వివిధ పనుల ప్రగతిపై కలెక్టరేట్ వీసీహాల్ నుంచి సోమవారం సమీక్షించారు. ఆరోగ్య సురక్ష సర్వే, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో, ప్రభుత్వ భవనాల నిర్మాణం, జగనన్నకు చెబుదాం, ఇతర కార్యక్రమాల ప్రగతిపై ఆరా తీశారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో గుర్తించిన రోగుల వివరాలు ఆధారంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తామని, సర్వే పక్కాగా చేపట్టాలన్నారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోను నిజాయితీగా నమోదుచేయాలన్నారు. సచివాలయం పరిధిలో జరిగే సర్వేను ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పర్యవేక్షించాలని ఆదేశించారు. మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థులుంటే



వీసీలో పాల్గొన్న అధికారులు

సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి బడి/కళాశాలలలో చేర్పించాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు తరుచూ సచివాలయాలను సందర్శించి క్షేత్రస్థాయిలో అందిస్తున్న సేవలను పర్యవేక్షించాలని సూచించారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్ నాటికి అన్ని ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించి సామూహిక ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యలకు త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. పనులకు సంబంధించిన బిల్లలను సకాలంలో అప్‌లోడ్ చేస్తే చెల్లింపులు చేస్తామన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన భవనాలను శుక్రవారంలోగా అప్పగించాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ కె.మయూర్‌అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్లు సుదర్శనదొర, వెంకటేశ్వరరావు, పద్మలత, నూకరాజు, అన్ని నియోజకవర్గాల స్పెషల్ ఆఫీసర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బస్సులో అటవీశాఖ ఉద్యోగి మృతి



మృతిచెందిన శివశంకర్

సాలూరు/పార్వతీపురం టౌన్: విధి నిర్వహణ కోసం బస్సులో వెళ్తున్న కురుపాం అటవీశాఖలో సీనియర్ అసిస్టెంట్ శివశంకర్ గుండెపోటుతో మరణించారు. సాలూరు పట్టణంలోని బంగారమ్మ కాలనీలో నివాసం ఉంటున్న ఆయన విధినిర్వహణ నిమిత్తం సాలూరు నుంచి పార్వతీపురం వెళ్లే బస్సులో సోమవారం ఉదయం వెళ్తుండగా పార్వతీపురం సమీపంలో గుండెపోటుకు గురయ్యారు. బస్టాప్‌కు బస్సు చేరినప్పటికీ ఆయన దిగకపోవడంతో గుర్తించిన ఆర్టీసీ సిబ్బంది వెంటనే 108కు ఫోన్ చేయగా, వారు వచ్చి పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. శివశంకర్ మృతితో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇద్దరు ఆడపిల్లలకు వివాహాలు అయ్యాయి.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి



ముత్యాలమ్మ మృతదేహం

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో ట్రాక్టర్ ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన ఏడువాక ముత్యాలమ్మ (53) కళ్లం నుంచి ఇంటికి వస్తుండగా ఎం.శింగవరం నుంచి వస్తున్న ట్రాక్టరు శివాలయం వద్ద ఆమెను వెనుకనుంచి ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త తాతారావు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆతవ గ్రామానికి చెందిన నెక్కల ఈశ్వర్రావు ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

నాగావళినదిలో మృతదేహం లభ్యం



అశోక్‌కుమార్ (ఫైల్)

గరుగుబిల్లి: నాగావళినదిలోని తోటపల్లి ప్రాజెక్టువద్ద సోమవారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైందని స్థానిక ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రంలోని రాయగడకు చెందిన శ్రీనివాసం అశోక్‌కుమార్(32) ఈనెల 20న తల్లితో కలిసి రాయగడలోని నాగావళినది పరీవాహక ప్రాంతానికి వినాయక నిమజ్జనానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడి కొట్టుకుపోయాడు. ఈ క్రమంలో మృతదేహం కొట్టుకువచ్చి సోమవారం తోటపల్లి ప్రాజెక్టు పరిసరాలలో లభ్యమైంది. ఈమేరకు మృతుడి సోదరుని ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డబ్బులకోసం బెదిరించిన వ్యక్తుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ ఎస్సైలు భాస్కరరావు, అశోక్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఫోన్‌లో మాట్లాడుతూ వెళ్తున్న వ్యక్తిని అడ్డగించి డబ్బులివ్వమని బెదిరించి, చితకబాది, చేతిలో ఉన్న సెల్‌ఫోన్ పట్టుకుని పరారైన ముగ్గురు నిందితులను వన్‌టౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక సీఎంఆర్ జంక్షన్ వద్ద వేకువజామున ఫోన్‌లో మాట్లాడుతూ నడుస్తున్న కోడి రామపృథ్వీ అనే వ్యక్తిని గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు డ్యూక్ బైక్‌పై వచ్చి డబ్బులు డిమాండ్ చేశారు. తనవద్ద డబ్బుల్లేవని చెప్పేసరికి రామపృథ్వీని చితకబాది చేతిలో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని బైక్‌పై వెళ్లిపోయారు. ఈ మేరకు బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. దర్యాప్తులో భాగంగా కేఎల్ పురం జంక్షన్ వద్ద ముగ్గురు వ్యక్తులు డ్యూక్ బైక్‌పై తిరుగుతున్నట్లు తెలుసుకున్న పోలీసులు నాగళ్ల వంశీ, పత్తికాయల అశోక్, యామల కార్తీక్‌లను అదుపులోకి తీసుకుని సెల్‌ఫోన్, డ్యూక్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సైలు భాస్కరరావు, అశోక్‌లు తెలిపారు.

పంట పొలాల్లో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని సుభద్రమ్మవలస, గవరమ్మపేట, రామినాయుడువలస, వెంకటరాజపురం పంట పొలాల్లో సోమవారం సాయంత్రం ఏనుగులు దర్శనమిచ్చాయి. అటవీశాఖాధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగులు తరలించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

శరవేగంగా అభివృద్ధిపనులు

- సత్ఫలితాలిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం
- శాశ్వత ప్రాతిపదికన పనులు చేయిస్తున్న యంత్రాంగం



బలిజిపేట మండలంలో నిర్మాణం పూర్తయిన రోడ్డు (ఫైల్)



పార్వతీపురం మండలం బొండపల్లి గ్రామంలో రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణు చరణ్ (ఫైల్)



కొమరాడ మండలంలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు

పార్వతీపురంటౌన్: తమ నాలుగేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల వద్దకే ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లేలా చర్యలు తీసుకుంది. ప్రభుత్వ సేవలన్నీ గ్రామ స్థాయిలోనే అందుబాటులోకి తెచ్చే క్రమంలో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. పార్వతీపురం మన్యం జిల్లాలో వార్డు, గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి ఇంటి ముంగిటినే ప్రజలకు సేవలందిస్తోంది. ఇక గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సచివాలయాలను సందర్శిస్తున్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో ఈ కార్యక్రమం ఇప్పటికే పూర్తయింది. సమస్యలను గుర్తించి అప్పటికప్పుడే నిధుల విడుదలకు సిఫారసు చేస్తున్నారు. వచ్చిన నిధులతో ప్రాధాన్యత ఆధారంగా పనులు ప్రారంభిస్తున్నారు. ఫలితంగా ఎక్కడికక్కడ సమస్యలకు పరిష్కారం లభిస్తోంది.

జిల్లాలో 287 పనులు పూర్తి

ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో గుర్తించిన పనుల్లో ఇప్పటివరకూ 2478 పనులు మంజూరు కాగా 2248 పనులు ప్రారంభమయ్యాయి. రెండు వారాల్లో మిగిలిన పనులు కూడా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 287 రోడ్లు, కాలువల పనులు పూర్తి చేశారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సమస్య, రోడ్ల మరమ్మతులు, మురుగు కాలువల పునరుద్ధరణ, వీధిలైట్ల ఏర్పాటు, పాఠశాల భవన నిర్మాణాలు తదితర మౌలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

అడుగడుగునా బ్రహ్మరథం

గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమానికి అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కార్ చేసినంతగా గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదని అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు ఆనందంతో చెబుతున్నారు. అడుగడుగునా ఆత్మీయంగా పలకరిస్తూ, ప్రజాప్రతినిధులకు ఎదురెళ్లి హారతులు పడుతున్నారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతి నిధులకు 'గడప గడపలో' ఆత్మీయ స్వాగతం లభించింది. ప్రతిపాదనలు అధికారులకు పంపగా స్పందించి నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేశారు.

జిల్లాలో పనుల మంజూరు ఇలా...

మండలం	మంజూరైన పనులు	ప్రారంభించినవి	పూర్తి చేసినవి
భామిని	37	31	6
పాలకొండ	49	46	3
పాలకొండ అర్బన్	15	11	04
సీతంపేట	453	331	28
వీరఘట్టాం	125	119	6
గరుగుబిల్లి	74	62	12
గుమ్మలక్ష్మీపురం	190	171	19
జియ్యమ్మవలస	150	109	9
కొమరాడ	106	82	16
కురుపాం	314	282	32
బలిజిపేట	77	57	20
పార్వతీపురం	102	88	14
పార్వతీపురం అర్బన్	112	81	31
సీతానగరం	116	108	8
మక్కువ	65	62	3
పాచిపెంట	191	175	16
సాలూరు	211	165	46
సాలూరు అర్బన్	91	81	10

'జిల్లాలో నిధుల మంజూరు రూ. లక్షల్లో..

నియోజకవర్గం	నిధుల మంజూరు రూ. లక్షల్లో
పాలకొండ	1533.00
కురుపాం	1866.00
పార్వతీపురం	1418.00
సాలూరు	1329.00

ప్రత్యేక పర్యవేక్షణ



గడపగడపకూ మన ప్రభుత్వంలో ప్రతిపాదించిన పనులకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. సచివాలయాల పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సచివాలయానికి తక్షణమే నిధులు విడుదలవుతున్నాయి. 'గడపగడపకూ మన ప్రభుత్వం'లో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు నిధులు వినియోగిస్తున్నాం.

– రామచంద్రరావు, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి, పార్వతీపురం మన్యం

సెంచూరియన్‌లో ముగిసిన హ్యాకథాన్ పోటీలు



ముగింపు ఉత్సవాల్లో మాట్లాడుతున్న సెంచూరియన్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు

- విద్యార్థులను అభినందించిన ప్రముఖులు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న జ్యూరీ సభ్యులు విజయ్‌కుమార్ సాహూ, పూజా విద్యాశంకర్, తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న సెంచూరియన్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో 72 గంటల పాటు నిర్వహించిన హ్యాకథాన్ పోటీలు సోమవారం విజయవంతంగా ముగిశాయి. పోటీల ముగింపు కార్యక్రమంలో వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో స్టార్టప్‌లు, ఉత్పత్తుల అభివృద్ధికి అవసరమైతే రూ.కోటి వరకు పెట్టుబడులు సమకూరుస్తామన్నారు. ఏ మేరకు పెట్టుబడులు పెట్టాలన్నా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. స్టార్టప్ చేపట్టిన వారికి ఎక్కువ ఆదాయ అవకాశాలున్నాయని చెప్పారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి మాట్లాడుతూ విద్యార్థులు 72 గంటల పాటు పనిచేసి ప్రాజెక్టులు రూపొందించడం ఆశ్చర్యం కలిగించిందని, విద్యార్థులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

పోటీల్లో 30 ప్రాజెక్టుల ఎంపిక

సెంచూరియన్‌లో 72 గంటల పాటు ఏకధాటిగా జరిగిన హ్యాకథాన్ పోటీల్లో 30 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఎన్ఆర్డీసీ నుంచి డాక్టర్ విజయ్‌కుమార్ సాహూ, నాస్కామ్ నుంచి స్ట్రాటజిక్ ప్లానింగ్ హెడ్ పూజా విద్యాశంకర్, విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి డాక్టర్ ఎంఎస్ ప్రసాద్, ఏపీఐఎస్ నుంచి లావణ్య, జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ, తదితరులు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించి ప్రాజెక్టులను పరిశీలించి ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేశారు. విద్యార్థులు బ్లాక్‌చైన్ అండ్ సైబర్ సెక్యూరిటీ, స్మార్ట్ ఎడ్యుకేషన్, స్మార్ట్ ఆటోమేషన్, అగ్రిటెక్, రోబోటిక్ డ్రోన్స్ తదితర అంశాలకు సంబంధించి 51 ప్రాజెక్టులు రూపొందించగా వాటిలో 30 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, గిరిజన విశ్వ విద్యాలయం ప్రొఫెసర్లు శరత్ చంద్ర, ఎన్వీ సూర్యనారాయణ, సీతం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ రావు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్‌లు సన్నీ డియోల్, రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు

సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు తెలిపారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీని కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ తపస్ మండల్, లెఫ్టినెంట్ కల్నల్ పల్లవి వర్మ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ఎన్‌సీసీ యూనిట్ త్వరలోనే వర్సిటీలో ఏర్పాటవుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కమాండింగ్ ఆఫీసర్‌లు మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వల్ల వ్యక్తి ఆలోచనా ధోరణి మారుతుందని, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

దేశ భవిష్యత్‌లో విద్యార్థుల పాత్ర కీలకం



విద్యార్థులతో మాట్లాడుతున్న ముఖ్యఅతిథి వినోద్‌కుమార్ పర్మార్



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు

డెంకాడ: దేశ భవిష్యత్ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమని విశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్, కోస్ట్‌గార్డ్ రిఫిట్, ప్రొడక్షన్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ పర్మార్ అన్నారు. ఈ మేరకు చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్, ఈఈఈ, ఐటీ, ఈసీఈ, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఇండియన్ కోస్ట్‌గార్డ్ ఇంజినీరింగ్ కెరియర్ -అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్ బిల్డింగ్ బ్లాక్‌లు అని చెప్పారు. ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో సాంకేతిక అధికారుల పాత్ర, నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించారు. విశాఖ తూర్పుతీరం చీఫ్ స్టాఫ్ టెక్నికల్ ఆఫీసర్ ఎం.కె.పధి మాట్లాడుతూ ఇండియన్ కోస్ట్‌గార్డ్ చరిత్ర, దాని విధులు, రిక్రూట్‌మెంట్ ప్రక్రియ, ప్రయోజనాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.రమేష్, వైస్‌ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, డీన్‌లు సునీల్‌ప్రకాశ్, ఎస్.మోహన్‌కుమార్, టీపీవో ఎంవీవీ భాను, కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న ప్లాంట్ కార్మికులు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడిలో ఉన్న ఆక్సైడ్ ప్లాంట్ మూతపడితే తమ జీవితాలు రోడ్డున పడతాయని, కుటుంబాలు రోడ్డున పడకుండా ఆదుకోవాలని కోరుతూ గరివిడిలో ఆర్ఎంఎం అండ్ ఆర్‌బీఎస్ అండ్ డీఎఫ్ఎన్ దాసు కంపెనీలో భాగంగా ఉన్న ఆక్సైడ్ ప్లాంట్ కార్మికులు కోరారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులంతా గరివిడిలో ధర్నా చేసి తహసీల్దార్ కార్యాయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్లాంట్‌లో గత 15 నుంచి 20 సంవత్సరాలుగా 110 మంది వర్కర్స్ పని చేస్తున్నామని, ఈ ప్లాంటును మూసివేసి అందులో పనిచేస్తున్న వర్కర్స్‌ను తొలగించాలని కోరుతూ ప్లాంట్ యాజమాన్యం ప్రభుత్వ అనుమతి కోసం దరఖాస్తు చేసిందన్నారు. ఈ ప్లాంట్ మూసివేస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం ప్లాంటు మూసివేత కోసం చేసుకున్న దరఖాస్తును తిరస్కరించి కార్మికులందరికీ పూర్తి పనిదినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎ.గౌరినాయుడు, విశ్వనాథరాజుతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

నిర్ణీత వ్యవధిలో వినతుల పరిష్కారం

- కలెక్టర్ నాగలక్ష్మి



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ శాఖలకు వచ్చిన వినతులను నిర్ణీత కాలవ్యవధిలోగా అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వినతుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. వినతులు స్వీకరించినప్పటి నుంచి కింది స్థాయి సిబ్బంది ఆయా వినతులను ఏ విధంగా పరిష్కరిస్తున్నారు, ఆయా అర్జీదారులు కోరిన విధంగా అర్జీ పరిష్కారం అవుతున్నదీ లేనిదీ పర్యవేక్షణ చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, మండల ప్రత్యేకాధికారులు తమ పరిధిలో వచ్చిన వినతుల పరిష్కారంపై నివేదికలను అందజేయాలని ఆదేశించారు. రీ ఓపెన్ అయిన కేసులను కూడా నిర్దేశిత గడువులోగా పరిష్కారమయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ అధికారులు స్పందన లాగిన్‌లో చూడాలని ఆదేశించారు. పరిష్కారమైన వినతుల నుంచి సంతృప్తి నివేదిక తీసుకోవడంతోపాటు అర్జీదారు ఇంటికి వెళ్లి ఈ కేవైసీ కూడా చేయాలని తెలిపారు. జనగన్నకు చెబుదాం కార్యక్రమంలో 244 వినతులను కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్ తదితరులు స్వీకరించారు.

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం

విజయనగరం క్రైమ్: స్పందనలో వచ్చే ఫిర్యాదులను పరిష్కరించి, బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ప్రజల నుంచి ఆమె 40 ఫిర్యాదులను స్వీకరించి, సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టి, చట్టపరిధిలో న్యాయం చేయాలని ఆదేశించారు.

ఫోల్డర్‌లు, బ్యాగుల సరఫరాకు షార్ట్ టెండర్లు

పార్వతీపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయిలో జరుగుతున్న ఆరోగ్య శిబిరాలకు వచ్చే ప్రజలకు కేస్‌షీట్ తయారుచేసేందుకు అవసరమైన ఫోల్డర్‌లు, బ్యాగులు సరఫరా చేసేందుకు షార్ట్ టెండర్లు కోరుతున్నట్లు జాయింట్ కలెక్టర్ గోవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య శిబిరాలకు వచ్చేవారికి లక్ష ఫోల్డర్‌లు, లక్ష బ్యాగులను సిద్ధం చేయాలని ప్రభుత్వంనుంచి ఆదేశాలు వచ్చాయని, ఈమేరకు ఆశక్తిగల ఏజెన్సీల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపా రు. టెండర్ దరఖాస్తును హెచ్‌టీటీపీఎస్://పార్వతీపురంమన్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 26, 27 తేదీలలో కార్యాలయం పనిదినాల్లో సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని పేర్కొన్నారు. 27 సాయంత్రం 5 గంటల తరువాత జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో టెండర్లు తెరవనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



పార్వతీపురం: వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్



పార్వతీపురం:దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందిస్తున్న డీఆర్ఓ వెంకటరావు



పార్వతీపురం టౌన్: సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురం: 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్‌లు ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక అంశాలపై 187 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని శాఖలవారీగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి బి.జగన్నాథ రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకర రావు, డీపీఓ బి.సత్యనారాయణ, డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, ఐసీడీఎస్ పీడీ కె.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరుచేసిన పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అన్నారు. సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వీల్‌చైర్ మంజూరు చేయాలని కొమరాడ మండలం రేగులవలస గ్రామానికి చెందిన దివ్యాంగురాలు గంద్రేటి అన్నపూర్ణ వినతిపత్రాన్ని అందించింది. ఈమేరకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తక్షణం స్పందించి విభిన్న ప్రతిభావంతుల శాఖాధికారులతో మాట్లాడి వీల్‌చైర్‌ను మంజూరు చేయించారు. ఆ వీల్‌చైర్‌ను డీఆర్‌ఓ అందించడంతో దివ్యాంగురాలు అన్నపూర్ణ హర్షం వ్యక్తం చేసింది.

ఫిర్యాదులపై సత్వర న్యాయం

పార్వతీపురంటౌన్: బాధితులకు ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన నేరుగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీసుస్టేషన్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకుని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులకు సూచించారు. సైబర్ నేరాలపై వచ్చిన ఫిర్యాదులపై స్పందించి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ హర్షిత, ఎస్‌బీసీఐ, సీహెచ్. లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ ఎన్.వి.ప్రభాకర రావు, ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

పార్వతీపురం: రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ కొమరాడ మండలం నయా పంచాయతీ లొద్ద గ్రామ గిరిజనులు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందించారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన వారు మాట్లాడుతూ కొమరాడ మండలం చినఖేర్జిల పంచాయతీ సర్వపాడు నుడి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో కొండపైన లొద్ద గ్రామం ఉంది. ఆ గ్రామానికి రహదారి సౌకర్యంలేక పోవడంతో చదువుకునేందుకు, వైద్యానికి, నిత్యం రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు సుబ్బారావు, మజ్జి రాయుడు, రామయ్య, వాసు తదితరులు కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

స్థలం అమ్మకం

- విజయనగరం, పద్మావతినగర్, శ్రీ వెంకటేశ్వర నగర్ కాలనీ లే అవుట్‌లో వుడా అప్రూవ్డ్ ప్లాట్ నెం. 203, 390 చ॥గ॥లు (40x80, West Facing) స్థలం అమ్మకంనకు కలదు. ఫోన్: 94401 23223 [V- 2136]

WANTED

- రిటైర్డ్, వి.ఆర్.ఎస్, సీనియర్ సిటిజన్స్ డిఫెన్స్ (R), హౌస్‌వైఫ్స్ (45Y), ఫ్రీలాన్సర్స్ జాబ్, బ్యాంకింగ్ రంగంలో (VSP), వారంలో ఒక రోజు హాజరు మిగతా రోజులు ఇంటివద్దనే, కనీస విద్యార్హత : 10th పాస్, ఫిక్స్‌డ్ శాలరీ PF, ESI, ఇన్సెంటివ్స్, ఇంటర్నేషనల్ కన్వెన్షన్. కాంటాక్ట్ : 8886339797 [S-1191161]
- బొబ్బిలి మన గ్రోమోర్‌లో పని చేయుటకు ఫీల్డ్ సిబ్బంది కావలెను. Qly: ఇంటర్, ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సెల్: 9701602206, 9959022110 [S-1220386]
- హైదరాబాదులో ఆప్తా ఎల్డర్‌కేర్‌లో ఉద్యోగ అవకాశం. M/F కేర్ టేకర్స్ కావలెను. జీతం: Age:21-45, Salary: 16-20 వేలు భోజన వసతి ఇన్సూరెన్స్ సౌకర్యం కలవు. ✆ 6300813664 [G-1126]
- వైజాగ్‌లో ఫుడ్, రూమ్ సదుపాయంతో మా షాపింగ్ మాల్ గోడౌన్స్ (Ware House) నందు పనిచేయుటకు 19-35 వయస్సు గల యువకులు కావలెను. నెల జీతం : 10,000/-. ఫోన్ : 97046 37370, 97051 94330 [V-26453]
- రామకృష్ణ గ్రూపు, VJA, HYD శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధుల సేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15 to 22 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 8639756219, 8639756226 [B-1068118]
- కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు, ప్రముఖుల ఇళ్ళ వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషెంట్లను చూసుకొనుటకు M/F కావలెను. Sal: 14-20K వసతి + భోజనం, విజయవాడ ✆ 91608 35559, 78158 35561 [B-385]
- మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221639]
- కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా,నర్సులు, వంట చేయువారు,RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000–35000 ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్ : 9391753308. [HA-654]
- MS కంపెనీ నందు పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్ వర్క్ చేయుటకు టెలికాలర్స్ కావలెను. మేల్/ఫిమేల్. Qly: 10th జీతం: 16,000 18,000. ఫోన్: 8499028319, 7416297427 [HA-632]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.